సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 7 । మే । 2024



బాబోయ్ డ్యూటీనా..

ఎండ వేడిమి ఒక వైపు.. ఇంజన్ వేడి మరో వైపుతో ఆర్టీసీ డ్రైవర్లు అరిగోస పడుతున్నారు.

వివరాలు IIలో ▸



కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యం

అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని జహీరాబాద్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. వివరాలు IIలో ▸



దిమ్మెలు కూలి..

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి.

వివరాలు IIIలో ▸

గీత దాటితే వేటే..

అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే సార్వత్రిక ఎన్నికలను కూడా ప్రశాంతంగా.. పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో గీత దాటితే వేటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు, చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రెవెన్యూశాఖతో సమన్వయం చేసుకుని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన 'సాక్షి'ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

- సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

- లోక్‌సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత
- పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- సుమారు 4 వేల మందితో భారీ బందోబస్తు
- కేరళ, తమిళనాడు నుంచి బలగాలు
- కోడ్ ఉల్లంఘన కేసులు త్వరితగతిన దర్యాప్తు
- అంతర్రాష్ట్ర సరిహద్దులపైనా ప్రత్యేక నిఘా
- క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నజర్
- 'సాక్షి' ఇంటర్వ్యూలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



☛ పోలింగ్ నిర్వహణకు బందోబస్తు ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. సుమారు నాలుగు వేల మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. హోంగార్డు నుంచి ఎస్పీ స్థాయి అధికారుల వరకు అందరూ ఎన్నికల విధులు నిర్వర్తిస్తారు. జిల్లాకు కేంద్ర బలగాలు కూడా వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పోలీసు బలగాలు పోలింగ్ రోజున జిల్లాకు వచ్చే అవకాశాలున్నాయి. ప్రశాంత వాతావరణంలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

☛ క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు.. వాటి వద్ద ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

రెవెన్యూ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని జిల్లాలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నాం. సుమారు 94 వరకు ఈ కేంద్రాలుంటాయి. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశాలున్న పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నాం. ఈ కేంద్రాల వద్ద సీసీ టీవీ కెమెరాల పర్యవేక్షణ, మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణ ఉంటుంది.

☛ తనిఖీల్లో సామాన్య జనాల డబ్బులే పట్టుకుంటున్నారు. అభ్యర్థులకు సంబంధించినవి పట్టుకున్న దాఖలాలు లేవు కదా?

తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.1.72 కోట్ల నగదు పట్టుబడింది. సుమారు రూ.21.89 కోట్ల విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకున్నాం. సామాన్యుల డబ్బులు పట్టుడితే సంబంధిత ఆధారాలు, ధ్రువపత్రాలు చూపిస్తే వెంటనే విడుదల చేస్తున్నాం. తనిఖీల సమయంలో ఆధారాలు చూపకుంటే జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీలకు డబ్బు అప్పగిస్తున్నాం. రూ.పది లక్షలలోపు నగదును ఈ కమిటీ 24 గంటల్లో విడుదల చేస్తుంది. వాహన తనిఖీలతో ఎన్నికల్లో డబ్బు పంపిణీని కట్టడి చేయవచ్చు.

☛ సంగారెడ్డి జిల్లా కర్ణాటక, మహారాష్ట్రతో సరిహద్దులు పంచుకుంటోంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాకు రెండు రాష్ట్రాల సరిహద్దులున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. తొమ్మిది చోట్ల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ఈ చెక్‌పోస్టుల్లో కేంద్ర బలగాలకు చెందిన సిబ్బంది, ఎస్‌ఐ స్థాయి అధికారి విధులు నిర్వర్తిస్తుంటారు. ఇవి కాకుండా 15 స్టాటిక్ సర్వేలెన్స్ టీంలను ఏర్పాటు చేశాం. వివిధ ప్రదేశాల్లో ఈ టీంలు వాహన తనిఖీలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాయి.

☛ కోడ్ ఉల్లంఘన కేసులు ఎన్ని నమోదు చేశారు?.. దర్యాప్తు ఎంత వరకు వచ్చింది.?

ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు జిల్లాలో ఆరు నమోదయ్యాయి. వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఒకరిద్దరు ప్రధాన పార్టీల అభ్యర్థులపై కూడా ఈ కేసులు నమోదు చేశాం. ఈ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేస్తున్నాం. సాక్షాధారాలకు సంబంధించిన వీడియోలను సేకరించాం. కొన్నింటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాం. టెక్నికల్ ఎవిడెన్స్, ఈ నివేదికలు రాగానే చార్జిషీట్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల ప్రక్రియ ముగిసే లోపు ఈ కేసుల్లో కొన్నింటి దర్యాప్తు కొలిక్కి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

☛ బైండోవర్ ఎంత మందిని చేశారు?

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో సుమారు ఐదు వేల మందిని బైండోవర్ చేశారు. ఈ ఎన్నికల్లో ఇప్పటి వరకు సుమారు 1,100 మందిని బైండోవర్ చేశాం. వారికి కౌన్సెలింగ్ కూడా నిర్వహించాం.

☛ ఎండలు మండిపోతున్న తరుణంలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న పోలీసుశాఖ సిబ్బంది విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది ఆరోగ్య విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వంటివి పంపిణీ చేయడంతో పాటు, ఎక్కువ మంది సిబ్బందితో తక్కువ సమయం పనిచేయిస్తున్నాం. అలాగే కొంత రిలీఫ్ దొరికేలా విధులను సర్దుబాటు చేస్తున్నాం.

☛ సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల కట్టడిలో పోలీసుశాఖ నిఘా ఎలా ఉంటుంది.?

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల విషయంలో జిల్లా స్థాయిలో ఉన్న ఎంసీఎంసీ కమిటీతో సమన్వయం చేసుకుంటున్నాం. ఈ కమిటీ సోషల్ మీడియాలో వస్తున్న అభ్యంతరకర ఎన్నికల ప్రచారంపై నిఘా ఉంచుతుంది.

☛ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించేలా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి. అనుమతులు లేకుండా ర్యాలీలు, రోడ్‌షోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. ఈ ర్యాలీలు, సభలు, సమావేశాల నిర్వహణకు దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేస్తున్నాం. మొత్తం మీద ఈ లోక్‌సభ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసుశాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

కేసీఆర్ రోడ్‌షోను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న హరీశ్ రావు

మాజీ మంత్రి హరీశ్ రావు

పటాన్‌చెరు: మెదక్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఈనెల 8వ తేదీన పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించనున్న మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షోను జయప్రదం చేయాలని మాజీ మంత్రి హరీష్ పిలుపునిచ్చారు. రోడ్‌షోపై సోమవారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. సమావేశంలో వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్రీకాంత్ గౌడ్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం జిన్నారం మండలం కొడకంచి గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు శ్రీశైలం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివ రాజ్ హాజరయ్యారు.

మోదీ పాలనలో వ్యవసాయం నిర్వీర్యం

- కాంగ్రెస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు
- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

సంగారెడ్డి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులు, రైతులను విస్మరించిందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం విమర్శించారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మోదీ పాలనలో వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతిన్నదని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జన సమితి పూర్తి మద్దతు తెలుపుతుందని, ఆ పార్టీ అభ్యర్థులు నీలం మధుకు, సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ దొందూదొందే అని ఎద్దేవా చేశారు. సమావేశంలో జన సమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, రాష్ట్ర నాయకుడు ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన కేంద్రం



మాట్లాడుతున్న రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

జహీరాబాద్: పంటకు గిట్టుబాటు ధర చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు విమర్శించారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎంఎస్‌పీలో కేంద్రం ఇచ్చే ధర చాలా వ్యత్యాసంగా ఉంటుందన్నారు. వరికి రూ.5050 ధర ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తే కేంద్రం రూ.2,183 మాత్రమే ఇస్తోందన్నారు. కందులకు రూ.11,166 ఇవ్వాలని కోరితే కేంద్రం రూ.7,000 మాత్రమే ఇస్తోందన్నారు. పత్తికి రూ.16,547 ప్రతిపాదిస్తే 7,020 ఇస్తోందన్నారు. ఇలా రైతులకు అన్ని విధాలుగా అన్యాయం చేస్తోందన్నారు. రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రైతు రక్షణ సమితి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో రాఘవేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామానుజరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి రాంచందర్‌గౌడ్, ఎం.జి.రాములు, జి.అశోక్, శుక్లవర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, అక్బర్, ఇమాంపటేల్, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమ్మర్ అలవెన్స్ అందించాలి

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తెర్పోల్‌లో ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించింది. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్‌తో పాటు ప్రతీ కూలీకి రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. భూమిలేని పేదలకు రైతు భరోసా మాదిరిగా కూలీ భరోసా ప్రతి సంవత్సరం రూ.50,000 ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం కోసం ప్రయత్నిస్తుందన్నారు. పనిచేసిన 15 రోజుల్లో డబ్బులు ఇవ్వాలని జీఓ చెబితే 2 నెలలైనా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.800 పెంచాలని, ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, వెంకటేష్, హనుమంతు, అశోక్, రాములు, వినోద, సుగుణమ్మ, కిష్టయ్య, రాజు, మానయ్య పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

న్యూస్‌రీల్

దీపాదాస్ మున్షీకు ఘన స్వాగతం



దీపాదాస్ మున్షీను సన్మానిస్తున్న కాటా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ నివాసానికి ఆమె రావడంతో నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. నియోజకవర్గంలో జరుగుతున్న లోకసభ ఎన్నికల ప్రచారంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యనేతలతో సమావేశం

జహీరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ నేత తన్వీర్ ఇంట్లో ముఖ్యనేతలతో దీపాదాస్ మున్షి సమావేశమయ్యారు. నియోజకవర్గంలో సాగుతున్న ప్రచారం, పార్టీ నేతలు, కార్యకర్తల పనితీరును సమీక్షించారు. సురేష్‌షెట్కార్, ఎన్.గిరిధర్‌రెడ్డి, ఏ.చంద్రశేఖర్ ఉన్నారు.

మోదీ హామీలు గ్యారెంటీగా అమలు



మాట్లాడుతున్న గోదావరి

జహీరాబాద్: ప్రధాని మోదీ ఆచరణ సాధ్యమయ్యే హామీలనే ఇచ్చి అమలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, లోక్‌సభ ప్రభారీ గంగారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికలప్పుడు అనేక హామీలిచ్చి ఆ తర్వాత మర్చిపోతున్నారని విమర్శించారు.

కాంగ్రెస్‌వి అన్నీ మోసాలే..

ములుగు(గజ్వేల్): మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ గద్దెనెక్కిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సోమవారం రాత్రి ములుగులో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా రోడ్‌షోలో పాల్గొని ప్రసంగించారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను నట్టేట ముంచిందన్నారు.

బీజేపీతోనే దేశ భద్రత, అభివృద్ధి

ఎమ్మెల్యే రాజాసింగ్



రోడ్‌షోలో మాట్లాడుతున్న రాజాసింగ్

జహీరాబాద్: ప్రధాని మోదీతోనే దేశభద్రత, అభివృద్ధి సాధ్యమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. సోమవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల మతాలకతీతంగా అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి మోది పాలన సాగిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముస్లింలు, మైనార్టీలు సైతం బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలందరికీ ఇండ్లు కట్టిస్తుందన్నారు. పాకిస్తాన్ ప్రభుత్వంలోని ఓ మంత్రి భారత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారన్నారు. కాంగ్రెస్ వస్తే తమ ఆటలు సాగుతాయనేది వారి ఉద్దేశమన్నారు. కాంగ్రెస్‌తో వారికి అంత సంబంధాలున్నాయనేది అర్థం అవుతోందన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు పుల్వామాలో సైనికులపై ఘాతుకానికి పాల్పడగా, మోదీ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై సర్జికల్‌స్ట్రైక్‌తో సమాధానం చెప్పారన్నారు. ఉగ్రవాదులు భారత్ వైపు చూడాలంటేనే వణికిపోతున్నారన్నారు. రాముడి పేరుతో బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించడం తగదన్నారు. దమ్ముంటే కాశీవిశ్వనాథుడి, మధుర శ్రీకృష్ణుడి ఫోటోలు పెట్టుకుని రాజకీయం చేయమని సవాల్ విసిరారు. బీబీ పాటిల్ మాట్లాడుతూ రెండు పర్యాయాలు తనను గెలిపించినందుకు కృతజ్ఞుడినని, మరోమారు గెలిపించి అభివృద్ధి చేసే భాగ్యం కల్పించాలని కోరారు. ఈ క్రమంలో రాజాసింగ్‌పై కాషాయం శ్రేణులు పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు జి.భాస్కర్‌తో పాటు పలువురు నేతలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ చేసిందేమీ లేదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ప్రజల కోసం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిందేమీ లేదని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. సోమవారం రాత్రి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ఈదులనాగులపల్లిలో రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈదులనాగులపల్లి ఆనుకొని ఉన్న రింగ్‌రోడ్డు దిగి రాలేని పరిస్థితి ఉందన్నారు. రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ ప్రజలు సేవలు పొందలేకపోతున్నారని తెలిపారు. నాగులపల్లిలో రైల్వే టెర్మినల్ ప్రారంభం కాకపోవడానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల అసమర్థతే కారణమన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డికి అభివృద్ధి మీద కంటే లక్డారం క్రషర్‌లపైనే ధ్యాస ఉంటుందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అన్నీ అబద్ధాలే చెబుతారని అన్నారు.



రోడ్‌షోలో పాల్గొన్న రఘునందన్ రావు

పటాన్‌చెరుపై పట్టెవరిదో?

మెదక్ బరిలో లోకల్ అభ్యర్థులు

- నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి
- ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు యత్నం
- పారిశ్రామికవాడల్లో హోరాహోరీగా ప్రచారం



పటాన్‌చెరు: ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయాల్లో పటాన్‌చెరుకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ ప్రాంత నేతలు అనేక కీలక పదవులు అధిష్ఠించి పాలిటిక్స్‌లో చురుకుగా వ్యవహరించారు. అయితే మెదక్ లోక్‌సభ స్థానానికి అంతర్జాతీయ స్థాయిలో పేరుంది. ఇందిరాగాంధీ ఇక్కడ నుంచే పోటీ చేసిన గెలుపొందిన సంగతి తెలిసిందే. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ స్థానం నుంచి పోటీ చేస్తున్న ముగ్గురు ప్రధాన ప్రత్యర్థులు పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం.

ముగ్గురు అభ్యర్థులు ఇక్కడివారే..

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పటాన్‌చెరులోనే చాలాకాలం విలేకరిగా పనిచేసి పేరు పొందారు. ఆయన గతంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి పారిశ్రామికవాడ రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. రఘునందన్ దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందకముందు పటాన్‌చెరు పట్టణంలో ఉన్న తన సొంతింటిలో ఉండేవారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పటాన్‌చెరు మండలం చిట్కుల్ నివాసి. ఆయన గతంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. జెడ్పీటీసీగా పటాన్‌చెరు నుంచి అప్పటి టీఆర్‌ఎస్ తరఫున పోటీచేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. ఈ ప్రాంతంలోని ప్రతీ సమస్యపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాల్టీలోని గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్నారు. ఆయన బంధువులకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ కొన్ని వందల ఇళ్లను ఈ ప్రాంతంలో నిర్మించింది. తెల్లాపూర్ మున్సిపాల్టీలో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. ఆయన గతంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా కూడా పని చేశారు. అప్పట్లో ఆయన పటాన్‌చెరు, ఆర్సీపురం పట్టణ ప్రాంత పౌరులతో మంచి సంబంధాలు ఉండేవి.

పారిశ్రామిక వాడలోని ఓట్లపైనే గురి

మెదక్ లోక్‌సభ పరిధిలో సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలు ఉన్నాయి. పటాన్‌చెరులో అధికంగా ఓటర్లు ఉంటారు. దీంతో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ నియోజకవర్గంపైనే దృష్టి సారించారు. వారికున్న వ్యక్తిగత సంబంధాలు, పరిచయాలతో ఇక్కడి ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ముగ్గురు ఇక్కడే ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. ఉత్తర భారత దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారందరూ తమకే ఓటు వేస్తారని లెక్కలు వేసుకుంటున్నారు. ఒడిశా, బీహార్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, తదితర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన కార్మికులను దగ్గర చేసుకునేందుకు ఎంపీ అభ్యర్థులు సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. బొల్లారం, అమీన్‌పూర్ పట్టణాల్లో బీజేపీ కౌన్సిలర్లు ఉండగా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి అన్నివర్గాలతో సత్సంబంధాలు ఉన్నాయి. అన్ని పారిశ్రామిక వాడల్లోనూ నీలం మధుకు వలస కార్మికులతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఆయనకున్న పరిచయాలతో పటాన్‌చెరు ప్రాంతంలో అధిక ఓట్లు కొల్లగొట్టాలనే ప్రయత్నంలో ఉన్నారు.

తెలంగాణ ఉద్యమానికి మద్దతు

ఇప్పటివరకు జరిగిన మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఓటర్లు తెలంగాణ ఉద్యమానికి మద్దతిచ్చినట్లు స్పష్టమవుతుంది. అయితే దుబ్బాకలో బీజేపీ ఉప ఎన్నికల్లో ఓటర్లు రఘునందన్‌రావు ఇచ్చిన విజయం, గతంలో ఇక్కడ ఆలె నరేంద్రను బీజేపీ నుంచి విజయవరించిందనే లెక్కలుకడుతూ బీజేపీ తన విజయావకాశాలను అంచనా వేస్తుంది. అయితే నరేంద్ర తర్వాత బీజేపీకి ఓటర్ల మద్దతు పెద్దగా లేదనే చెప్పాలి. బాగారెడ్డి తర్వాత జిల్లాలో కాంగ్రెస్‌కు ఎంపీ స్థానం లేకపోవడంతో ఈసారి ఎలాగైనా నెగ్గాలనే లక్ష్యంతో ఏఐసీసీ, పీసీసీ వర్గాలు ప్రణాళికలు రచించాయి. అందరి అంచనాల్లోనూ పటాన్‌చెరులోని ఓటర్లే కీలకం కానున్నారు.

అదనపు పోలింగ్ సిబ్బందికి శిక్షణ

సంగారెడ్డి టౌన్: ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించిన అదనపు పోలింగ్ సిబ్బందికి ఈనెల 7, 8 తేదీలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ క్రాంతి వల్లూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ లోక్‌సభ అన్ని నియోజకవర్గ కేంద్రాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీయూ(సర్క్యూట్ యూనిట్)లలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే అదనపు యూనిట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సీ విజిల్, టోల్ ఫ్రీ నంబర్ 1950కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పని తీరును పరిశీలించాలన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి టౌన్: జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి కోరారు. సోమవారం జిల్లా కార్యాలయంలో రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎలాంటి పరిమితి లేకుండా జొన్నలు కొనాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, పంట రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలను అందజేయాలన్నారు.

క్లుప్తంగా

బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు

ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రత్నయ్య



మాట్లాడుతున్న రత్నయ్య

మెదక్‌జోన్: బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని, మత రాజకీయాలు చేస్తూ మనుషుల మధ్య చిచ్చుపెట్టే ఆ పార్టీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రత్నయ్య అన్నారు. సోమవారం ఆయన మెదక్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో 400 సీట్లు తమకు వస్తాయని చెప్పుకుంటున్నారని, అదే జరిగితే రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేస్తారన్నారన్నారు. మోదీ సర్కార్ మరోసారి అధికారంలోకి వస్తే ఏబీసీడీ వర్గీకరణ జరుగుతుందని, మంద కృష్ణమాదిగ తన స్వార్థం కోసం ఎస్సీలను మోసం చేసే కుట్ర చేస్తున్నారని రత్నయ్య ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నిమ్మలగారి గంగయ్య, నాయకులు భిక్షపతి, దాస్, జగన్, ఎండీ ఖాజీం తదితరులు ఉన్నారు.

దేవుళ్ల మీద ప్రమాణం ఓట్లు దండుకోవడానికే..

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ప్రమాణం చేసేది ఓట్లు దండుకోవడానికే అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కిష్టంపేట, గౌరయపల్లి, మర్రిముచ్చాల, లెనిన్‌నగర్, రాంసాగర్, కొమురవెల్లి, రసులాబాద్, అయినాపూర్, తపాస్‌పల్లి, గురువన్నపేట, పోసాన్‌పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశంకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయని కాంగ్రెస్‌ను విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, జెడ్పీటీసీ సిద్ధప్ప, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గదరాజు చందు, కొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ డ్యూటీనా..

ఆర్టీసీ డ్రైవర్ల అరిగోస

నలభై ఐదు డిగ్రీల ఎండ వేడిమి ఒక వైపు.. ఇంజన్ వేడి మరో వైపుతో ఆర్టీసీ డ్రైవర్లు అరి గోస పడుతున్నారు. తీవ్ర ఎండలోనే ప్రతి రోజూ సుమారు 12 గంటలపాటు డ్యూటీ చేస్తున్నారు. దీంతో ఉక్కపోత భరించలేక డ్రైవర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. డ్రైవర్ సీటు వద్ద కనీసం ఫ్యాన్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో చేసేదిమి లేక కష్టం మీద విధులు నిర్వహిస్తూ ఇప్పటికే 8 మంది డ్రైవర్లు అనారోగ్యం పాలయ్యారు.

- మెదక్‌జోన్

ఇంజన్ వేడి ఒక వైపు.. మండే ఎండలు మరో వైపు

- ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి
- డ్రైవర్ సీట్ వద్ద ఫ్యాన్లు కరువు
- నిత్యం 12 గంటలపాటు విధుల్లో..
- ఇటీవల ఎనిమిది మంది డ్రైవర్లు ఆస్పత్రిపాలు



మెదక్ ఆర్టీసీ డిపో

మెదక్ డిపోలో మొత్తం 109 బస్సులు ఉండగా వాటిలో 55 బస్సులు ప్రైవేట్‌కు చెందినవి కాగా 54 ఆర్టీసీ సంస్థకు చెందినవి ఉన్నాయి. కాగా 320 మంది సిబ్బంది ఉండగా వారిలో 280 మందికి పైగా డ్రైవర్లు, కండక్టర్లు ఉన్నారు. ఇందులో ఆర్డినరీ బస్సు రోజుకు 340 కిలో మీటర్లు తిరుగుతుండగా ఎక్స్‌ప్రెస్‌లు, డీలక్స్‌లు మాత్రం నిత్యం 360 నుండి 400 కిలో మీటర్ల వరకు తిరుగుతున్నాయి. 20 రోజులుగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుంది. ప్రస్తుతం జిల్లాలో 45.1 డిగ్రీలుగా నమోదవుతుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భానుడు విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. జిల్లాలో ఇంటి నుంచి బయట కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఇంతటి ఎండలోనూ ఆర్టీసీ డ్రైవర్లు రోజుకు సుమారు 400 కిలోమీటర్ల మేర బస్సులను నడుపుతూ నరకం అనుభవిస్తున్నారు. డ్రైవర్ సీటుపై బాగాన చిన్నపాటి ఫ్యాను అమర్చితే తమకు కొంతైనా మేలు జరుగుతుందని, తమ ఆరోగ్యాలు పాడవకుండా ఉంటాయని డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు.

12 గంటలు డ్యూటీ

లేబర్ చట్టం ప్రకారం ఆర్టీసీలో పని చేసే డ్రైవర్లు, కండక్టర్లకు నిత్యం 8 గంటలు మాత్రమే విధులు నిర్వహించాలి. అంతకు మించి పని చేస్తే ఓవర్ టైం (ఓటీ) కట్టించాల్సి ఉంటుంది. గతంలో ఆర్టీసీలో 12 నుంచి 13 గంటల డ్యూటీ చేస్తే ఆ మరుసటి రోజు స్పెషల్ ఆఫ్ కింద డ్యూటీ ఉండేది కాదు. ప్రస్తుతం కండక్టర్లకు అదే విధానం కొనసాగుతుండగా డ్రైవర్లకు మాత్రం ఆ విధానం తొలగించినట్లు కొందరు డ్రైవర్లు చెబుతున్నారు. నిత్యం 12 గంటలకు పైగా ఎర్రటి ఎండలో వందల కిలోమీటర్ల మేర బస్సులు నడుపుతున్నారు. గతంలో మాదిరిగా 12 గంటలపాటు బస్సు నడిపితే ఆ మరుసటి రోజున స్పెషల్ ఆఫ్ ఇవ్వాలని కోరుతున్నారు.

ఎనిమిది మందికి అస్వస్థత

ఇటీవల మెదక్ డిపోకు చెందిన 8 డ్రైవర్లు అనారోగ్యం పాలయ్యారు. వారిలో ముఖ్యంగా బీపీ, కంటిజబ్బులు, హార్ట్‌కు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారు. డిపోలో ఇటీవల హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేయగా వైద్యులు వారిని గుర్తించారు. ఎనిమిది తార్నాకలో గల ఆర్టీసీ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

భరించలేకపోతున్నాం

ఎండలు, ఇంజన్ వేడి భరించలేకపోతున్నాం. తరుచూ విరేచనాలు అవుతున్నాయి. నరకం అనుభవిస్తూ తప్పని పరిస్థితుల్లో బస్సు నడుపుతూ తరుచూ ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నాం.

– ఎండీ గౌసొద్దీన్, డ్రైవర్ మెదక్ డిపో



ఫ్యాన్లు అమర్చాలి

బస్సుల్లో డ్రైవర్ సీటు చిన్నగా ఉంటుంది. చిన్నపాటి ఫ్యాన్లు అమర్చితే గాలి వచ్చేది. కొంత మేర ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేవాళ్లం. కానీ మా బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఎండీ ముజీబ్, డ్రైవర్ మెదక్ డిపో



ఉపశమనం కోసం మజ్జిగ ఇస్తున్నాం

ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం డ్రైవర్లు, కండక్టర్లతోపాటు ఇతర సిబ్బందికి నిత్యం మజ్జిగ ఇస్తున్నాం. ఇటీవల వైద్యులతో సిబ్బంది హెల్త్ చెకప్ చేయించగా 8 మందిని రెఫర్ చేశారు. డ్రైవర్లకు స్పెషల్ ఆఫ్ ఎప్పుడు లేదు. డ్రైవర్లు ఉపశమనం పొందేలా చర్యలు చేపడుతాం.

– సుధ, ఆర్టీసీ డీఎం మెదక్

సైబర్ వలలో ఎక్స్ సర్వీస్‌మెన్

- టాస్కులు కమీషన్ల పేరుతో మోసం
- రూ.15.21 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఎక్స్ సర్వీస్‌మెన్ రూ.15.21 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్‌కు పార్ట్ టైం జాబ్ అంటూ ఏప్రిల్ 26వ తేదీన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అతడు తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి ఓ వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. బాధితుడు ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు పలు మార్లు మొత్తం రూ.15 లక్షల 21 వేలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. సోమవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ధార్మికకార్య వీరగల్లు విగ్రహం లభ్యం

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో గుర్తింపు



బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లిలో సోమవారం కొత్త తెలంగాణ బృందం యువ పరిశోధక సభ్యుడు శ్రీనివాస్ పర్యటించి ధార్మికకార్య వీరగల్లు విగ్రహం గుర్తించారు. వీరగల్లులో ప్రత్యేక వర్గానికి చెందిన వాడు ధార్మిక వీరగల్లుడని తెలిపారు. దేవక్కపల్లిలో గతంలో లభించిన శాసనం శక సంవత్సరం 993 విరోధికృత్ ఆషాఢ మాసం సూర్య గ్రహణం సందర్భంగా అనగా క్రీస్తు శకం 1071 జూన్ 30న దానం చేయుట గురించి చెక్కబడిందని వివరించారు. ఈ వీరుడి పేరున దానాలు చేసినట్లు భావించవచ్చన్నారు. వీరగల్లు వీరుడి ఆహార్య శైలి, నడినెత్తిన కొప్పు, ఎడమ చేతిలో లింగం కనిపిస్తుంది. మూడు అంతస్తులతో కనిపిస్తున్న కల్యాణి చాణిక్యుల కాలం నాటిదని తెలిపారు.

యువతి అదృశ్యం

న్యాల్‌కల్(జహీరాబాద్): యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని చినిగెపల్లిలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు కథనం మేరకు.. గ్రామానికి చెందిన నర్సప్ప కుమార్తె కొటారి భాగ్య(28) గత నెల 30న కుటుంబ సభ్యులతో కలసి రాత్రి నిద్రించింది. కొద్దిసేపటికే రాత్రి 2 గంటల ప్రాంతంలో ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు ఆమె ఒంటిపై ఎరుపు రంగు పంజాబీ డ్రెస్ ఉందన్నారు. తెలుగు, కన్నడ భాష మాట్లాడుతుందన్నారు. ఈ విషయంలో అదే గ్రామానికి చెందిన యువకుడిపై అనుమానం ఉన్నట్లు బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వివాహిత..

చేగుంట(తూప్రాన్): వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలరాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన కోటగిరి నీలమణి(26)కి పాప, బాబు ఉన్నారు. ఈమె ఏప్రిల్ 28న తన పుట్టింటికి వెళుతున్నట్లు చెప్పి వెల్దుర్తి మండలం రామాయిపల్లి గ్రామానికి వెళ్లింది. ఈ నెల 4న అనంతసాగర్‌కు వస్తున్నట్లు రామాయిపల్లి నుంచి బయలుదేరి అనంతసాగర్‌కు రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంజీరాలో మునిగి బాలుడు మృతి


- ఎండ ఉపశమనం కోసం స్నానానికి వెళ్లిన కుటుంబం
- ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

కొల్చారం(నర్సాపూర్): మంజీరా నీటి మడుగులో మునిగి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. కౌడిపల్లి మండలం సదాశివపల్లి గ్రామానికి చెందిన కొండి భూమేశ్-యశోదకు ఇద్దరు కుమారులు. భూమేశ్ కుటుంబం ఖాళీ సీసాలు ఏరుతూ వచ్చిన డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి ఖాళీ సీసాలు ఏరేందుకు భూమేశ్ భార్య, కుమారులతో ఏడుపాయల వనదుర్గాదేవి సన్నిధికి వచ్చారు. సీసాలు ఏరుతూ మధ్యాహ్నం సమయంలో ఎండ ఉక్కపోతగా ఉండడంతో నలుగురు కలిసి పోతంశెట్టిపల్లి గ్రామ శివారులోని మంజీరా నది మడుగులోకి దిగి స్నానం చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు కొండి దుర్గేశ్ (16) స్నానం చేస్తూ లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కిష్టాపూర్ నుంచి గజ ఈతగాళ్లని రప్పించి దుర్గేశ్ మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి, మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.14.62 లక్షలు సీజ్



సిద్దిపేట కమాన్: నగదు చూపుతున్న సీఐ లక్ష్మీబాబు

సిద్దిపేటకమాన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేటలో సోమవారం నిర్వహించిన ఆకస్మిక వాహనాల తనిఖీల్లో రూ.14,62,000 సీజ్ చేసినట్లు సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా వాహనాల తనిఖీ నిర్వహించగా పట్టణానికి చెందిన రమేశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా బైక్‌పై తరలిస్తున్న రూ.8,62,000 సీజ్ చేశామన్నారు. అదే విధంగా చౌదారం గ్రామానికి చెందిన రాములు నుంచి రూ.6 లక్షలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నగదును జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించడం జరిగిందన్నారు.

రూ.1.23 లక్షలు స్వాధీనం

గజ్వేల్‌రూరల్: సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు సోమవారం వాహన తనిఖీలను చేపట్టినట్లు గజ్వేల్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో బూరం మల్లేశం తన వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 55 వేలు, లాల్‌గడి మలక్‌పేటకు చెందిన మరో వ్యక్తి శిలసాగర్ సిద్దులు కారులో తీసుకెళ్తున్న రూ.68.500 సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

రూ. 1,11,400 సీజ్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. సిద్దిపేటకు చెందిన సుంచు నాగరాజు తన వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.1,11,400 సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

పొలిటికల్ హీట్

కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే

బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్



మాట్లాడుతున్న గాలి అనిల్ కుమార్

నారాయణఖేడ్: హామీలను అమలుచేయని బీజేపీ, కాంగ్రెస్‌లకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి నారాయణఖేడ్ శివాజీ చౌక్ నుంచి రాజీవ్ చౌక్ వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను ఎగ్గొట్టడంలో కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందేనని విమర్శించారు. తనను గెలిపిస్తే బసవేశ్వర ఎత్తిపోతల పథకం, రైల్వేలైను ఏర్పాటు, జాబ్‌మేళాలతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు అధికారంలో ఉన్నప్పుడే కాంగ్రెస్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాకే ప్రజల అవసరాలు గుర్తించి అనేక అభివృద్ధి పనులు చేశానన్నారు. ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, బీఆర్ఎస్ అధ్యక్షుడు పరమేశ్, నగేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ రుబీనా నజీబ్, ముజమ్మిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, భూపాల్ రెడ్డి సోమవారం మండలంలోని పైడిపల్లి, రుద్రార్ తదితర గ్రామాల్లో అనిల్ కుమార్ తరపున ప్రచారం నిర్వహించారు.

మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయం

బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ పార్లమెంట్‌తోపాటు దేశంలో గెలిచేది బీజేపీనే అని, ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రం వెల్దుర్తిలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి హైస్కూల్ క్రీడాప్రాంగణం వరకు రోడ్డు షో చేపట్టారు. ప్రజలనుద్దేశించి రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజలకు చేసిన అన్యాయాన్ని తిప్పికొట్టి బీజేపీ ప్రభుత్వానికి పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. రాజ్యాంగం రద్దు, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని చేసే బూటకపు ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసే తనను ఎంపీ ఎన్నికల్లో గెలిపిస్తే కేంద్రం నిధులతో పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. ప్రచారంలో నియోజకవర్గ నాయకులు మురళీ యాదవ్, మండల అధ్యక్షుడు నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, వెంకటేశం, బాలకిషన్, పాల్గొన్నారు.

మా పార్టీతోనే సంక్షేమం సాధ్యం

కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: అభివృద్ధితోపాటు అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. ఖేడ్‌లోని ఆయన నివాసంలో సోమవారం నాగల్‌గిద్ద మండలం షాపూర్, మోర్గీ, మనూరు మండలం తిమ్మాపూర్, కంగ్టి మండలం, ముకుంద్ తండాలకు చెందిన దాదాపు 250 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, కంగ్టి మాజీ జెడ్పీటీసీ సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. సోమవారం మండలంలోని రంజోల్ గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్ బాబు, బీఆర్ఎస్ నాయకులు బాబా, నర్సింహా, గుండ్‌రెడ్డి, చంద్రన్న, యూనూస్, నిజాం, సర్దార్, మస్తాన్, యూసూఫ్‌లను కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎ.చంద్రశేఖర్, పార్టీ యువజన నియోజకవర్గం ఇన్‌చార్జి కె.నరేశ్ గౌడ్, పార్టీ నాయకులు వైజ్యనాథ్, ఖలీల్, మన్సూర్, షబ్బీర్, రవీందర్‌రెడ్డి, రాజు, శశి, మజార్, షౌకత్ పాల్గొన్నారు.

నిమ్జ్‌లో స్థానికులకే ఉద్యోగాలు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు కాబోతున్న నిమ్జ్‌లో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సునీతాపాటిల్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కిందట తాను ఎంపీగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిమ్జ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కానీ గత బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలతో నిమ్జ్ ముందుకు సాగలేదని, భూ సేకరణ చేపట్టలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనకు ఎంపీగా అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాజ్ మోహన్ ఉన్నితన్, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, జెడ్పీటీసీ సభ్యురాలు వినీల, ఎంపీపీ దేవదాసు ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్ పాటిల్, న్యాల్కల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు శకుంతల, నాయకులు ముల్తానీ, మారుతీ రావు పాటిల్, సంగ్రామ్ పాటిల్, వీర్ శెట్టి, సలీం, భాస్కర్ రెడ్డి, గుండప్ప, శ్రీకాంత్ రెడ్డి, నర్సింలు పాటిల్, రాజ్ కుమార్, సిద్దు పాటిల్, మహేందర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు



మాట్లాడుతున్న నీలం మధు

హవేళిఘణాపూర్(మెదక్): కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద ప్రజలు కన్న కలలను సాకారం చేసే దిశగా పని చేస్తుందని కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బూర్గుపల్లిలో స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌తో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మెదక్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉందని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అన్ని రంగాల్లో వివక్షకు గురైందన్నారు. తనను గెలిపిస్తే మెదక్ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, వెంకన్న, పరుశురామ్, పద్మారావు, హఫీజుద్దీన్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో అపశృతి, ముగ్గురికి గాయాలు

హవేళిఘణాపూర్ నుంచి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన యువకులు బైక్ ర్యాలీగా బయల్దేరారు. ఇదే సమయంలో ఎల్లారెడ్డి వైపు నుంచి బీహార్ రాష్ట్రంకు చెందిన ఇద్దరు కూలీలు బైక్‌పై వస్తూ శాలిపేట మలుపు ర్యాలీకి ఎదురుగా వచ్చారు. తొగిటకు చెందిన భరత్ బైక్‌ను ఢీకొట్టగా ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించారు.

పథకాలను ప్రజలకు వివరించండి

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయించాలని మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో మండల పరిధిలోని గ్రామాల, పట్టణ పరిధిలోని వార్డుల వారీగా బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. భువనగిరి ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణ అధ్యక్షుడు చిరంజీవులు, నాయకులు, కిష్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.